పల్లెల అభివృద్ధికి కృషి చేస్తా

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి
- గాదిగూడ మండలంలో విస్తృత పర్యటన
- బీటీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ

గాదిగూడలో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే కోవలక్ష్మి

నార్నూర్, మార్చి 11: పల్లెల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి పేర్కొన్నారు. గాదిగూడ మండలంలో సోమవారం ఆమె విస్తృతంగా పర్యటించారు. గాదిగూడ మండల కేంద్రం లోని కేజీబీవీ పాఠశాలలో, మారేగావ్ నుంచి మేడిగూడ, పావునూర్ లొద్దిగూడ గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఆయా గ్రామాల్లో ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. శాలుశాలతో సన్మానించారు. ఆయా గిరిజన గూడెల్లో నెలకొన్న సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలో లేకపోయినా సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గిరిజన గూడేల్లో జరిగిన అభివృద్ధిని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ ఆడ చంద్రకళ-రాజేశ్వర్, జడ్పీటీసీ మెస్రం గంగుబాయి-సోము, వైస్ ఎంపీపీ మర్సివనే యోగేశ్, పీఆర్ డీఈ రమేశ్, మండలాధ్యక్షుడు పూసం బాదిరావు, మాజీ సర్పంచులు మెస్రం జైవంత్‌రావ్, దిగంబర్, బాద్దుబాయి, నాయకులు కోవ దేవ్‌రావ్, మెస్రం శేఖర్‌బాబు, యుర్వేత రూప్‌దేవ్, సయ్యద్‌ఖాశీం, లాలా పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు

అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు

ఆసిఫాబాద్, మార్చి 11: ప్రజావాణి అర్జీలపై ప్రత్యేక దృష్టిసారించి పరిష్కరిస్తున్నట్లు అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు పేర్కొన్నారు. జిల్లా కేంద్రం లోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో సోమవారం వారు జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్ రావు, కాగజ్‌నగర్ ఆర్డీవో సురేశ్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వాంకిడి మండలం ఖేడేగావ్ గ్రామానికి చెందిన మడావి శేషు తాను కాగజ్‌నగర్ మండలం నారాపూర్ శివారులో కొంత భూమి కౌలుకు తీసుకొని సాగు చేసుకుంటూ జీవిస్తున్నానని, సొంతంగా భూమిని సాగు చేసుకునేందుకు గోండు ఆదివాసీ తెగకు చెందిన తనకు భూమిని ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు ఇచ్చాడు. సిర్పూర్ (టీ) మండలం లక్ష్మీపూర్‌కు చెందిన జమీల్ తనకు ప్రభుత్వం మంజూరు చేసిన అసైన్డ్ భూమి ఉందని, ఇట్టి భూమిలో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వాలని దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ మండలం కసబ్‌వాడి ప్రాంతానికి చెందిన ఈదులవాడ విజయ్‌కుమార్ తనకు వాంకిడి మండలం జంబూల్దరి గ్రామ శివారులో భూమి ఉండగా ఓ వ్యక్తి అక్రమంగా తన పేరిట మార్చుకున్నాడని, ఆ పట్టాను రద్దుచేసి తన పేరిట పట్టా పాస్ పుస్తకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. లారీ అసోసియేషన్ ప్రతినిధుల కారణంగా సిర్పూర్ పేపర్ మిల్లు నిర్వహణకు అంతరాయం ఏర్పడుతున్నదని, ఈ విషయమై స్పందించి కార్మికులను, పేపర్ మిల్లును కాపాడాలని మిల్లు వర్కర్స్ కమిటీ సభ్యులు కోరారు. సిర్పూర్ (టి) మండలం డోర్‌పల్లి గ్రామానికి చెందిన విలాస్ తనకు వారసత్వంగా వచ్చిన భూమిని కుటుంబ సభ్యులు ఎవరికి సమాచారం ఇవ్వకుండా ఇతరుల పేరిట పట్టా చేశారని, అట్టి పట్టాను రద్దు చేసి తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెజ్జూరు మండలం సోమిని గ్రామానికి చెందిన కమ్మరి ఇస్తారి తాము 70 ఏళ్లుగా వారసత్వంగా సంక్రమించిన భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నామని, ఓ వ్యక్తి తమ భూమిని ఆక్రమించుకొని పట్టా చేయించుకున్నాడని, విచారణ చేపట్టి న్యాయం చేయాలని దరఖాస్తు అందజేశారు. బెజ్జూర్ మండలం మర్తిడి గ్రామానికి చెందిన దుర్గం శంకర్ తన కుటుంబానికి అట్రాసిటీ ద్వారా మంజూరైన డబుల్ బెడ్రూం ఇల్లు ఇప్పించాలని దరఖాస్తు అందజేశారు. బెజ్జూర్ మండలం పోతేపల్లి, కాటేపల్లి గ్రామాల రైతులు తాము చేవెళ్లలో భూములు కోల్పోయామని, నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'మహిళాశక్తి' ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

ఆసిఫాబాద్, మార్చి 11: హైదరాబాద్ లోని పరేడ్ గ్రౌండ్‌లో చేపట్టే తెలంగాణ మహిళా శక్తి పథకం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో సోమవారం ఆయన డీఆర్డీవో సురేందర్, డీపీవో భిక్షపతి గౌడ్, డీఎంహెచ్‌వో తుకారం, ఏపీడీ రామకృష్ణ, ఆర్టీసీ డీఎం శ్రీధర్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మహిళలకు రూ. కోటి వరకు రుణం, బీమా సౌకర్యం అందించడంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన మహిళా శక్తి పథకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి మహిళా సంఘాల సభ్యులను తరలించేందుకు 15 బస్సులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఒక్కో బస్సులో 50 మంది చొప్పున 750 మంది మహిళలను తరలించాలని ఆదేశించారు. జిల్లా పేరు తెలిసేలా బ్యానర్లు, ప్రతి ఒక్కరికీ గుర్తింపు కార్డు, భోజన వసతి కల్పించాలన్నారు. ప్రతి బస్సుకు ఒక లైజన్ అధికారితో పాటు కానిస్టేబుల్, ఆశ కార్యకర్తను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

కౌటాల, మార్చి 11: మండల కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం 376 మందికి గానూ 355 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు సీఎస్ బాలకిషన్ రావు తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని డీఐఈవో శంకర్, జిల్లా పరీక్ష కమిటీ సభ్యులు రాజయ్య, హతియా తనిఖీ చేశారు. వారి వెంట డీవో దౌలత్, అధ్యాపకులున్నారు.

నేడు కొలాం సంఘం ఎన్నికలు

జైనూర్, మార్చి 11: మండలంలోని జంగాం కొలాంగూడలో మంగళవారం జిల్లా కొలాం ఆదివాసీ సంఘం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకులు ఆత్రం భీంరావ్, సీడాం రాజు, కుల పెద్దలు కన్నీరం, లచ్చు, సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలోని కొలం సంఘాల నాయకులు, కొలం వాసులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు మండల సమావేశం

కెరమెరి, మార్చి 11: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 13న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కృష్ణారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి

అదనపు కలెక్టర్ వేణుకు వినతిపత్రం ఇస్తున్న సాయినగర్ వాసులు

ఆసిఫాబాద్ టౌన్, మార్చి 11: జిల్లా కేంద్రం నుంచి ఫోర్‌లేన్ రహదారికి అప్రోచ్ రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టాలని సాయినగర్ కాలనీ అధ్యక్షుడు కురాట్కర్ శంకర్ సోమవారం కాలనీ వాసులతో కలిసి అదనపు కలెక్టర్ దాసరి వేణుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లా కేంద్రం నుంచి గుండి రోడ్ మీదుగా నాలుగు వరుసల రహదారికి ఉన్న అప్రోచ్ రోడ్ ఇరుకుగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టి, ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీవాసులు మహేశ్ గౌడ్, కిషన్ గౌడ్, నారాయణ, ప్రదీప్, గిరీశ్, సంతోష్, అశోక్ పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం

దహెగాం, మార్చి 11: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. కేక్ కట్ చేశారు. వైద్యాధికారి స్పందన, సీనియర్ మహిళా ఆరోగ్య కార్యకర్త ప్లారెన్స్ విజిత, జూనియర్ మహిళ ఆరోగ్య కార్యకర్త శాంత, ఆశ వర్కర్ సుశీలను శాలువాలు, పూలమాలలతోసన్మానించారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ, వైద్యం రంగంలో మహిళలు సేవలందించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సంపత్, పీహెచ్ఎన్ పావని, హెచ్‌వీ పద్మ, ఎంఎల్ హెచ్‌పీలు మల్లికార్జున్, రేవతి, జ్యోతి, కీర్తి, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

కేక్ కట్‌చేస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

న్యాయాధికారుల నియామకం

ఆసిఫాబాద్, మార్చి 11: జిల్లా కేంద్రం లోని న్యాయస్థానంలో ఈనెల 16న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహణకు న్యాయాధికారులు, లోక్ అదాలత్ సభ్యులను నియమించినట్లు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి యువరాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి కం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులకు సంబంధించిన సివిల్, క్రిమినల్, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు చెందిన అన్ని రకాల కేసుల పరిష్కారానికి న్యాయాధికారిగా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి యువరాజ్, లోక్ అదాలత్ సభ్యులుగా ధీరజ్ భౌమిక్, ఎం చరణ్ తేజ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు సంబంధించిన సివిల్, క్రిమినల్, కాంపౌండబుల్, ఎక్సైజ్, డ్రంకెన్ డ్రైవ్ కేసుల పరిష్కారానికి న్యాయాధికారిగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మి, లోక్ అదాలత్ సభ్యులుగా కిశోర్, విద్యాసాగర్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇంటి పన్ను వందశాతం వసూలు చేయాలి

గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న డీపీవో భిక్షపతి గౌడ్

కెరమెరి, మార్చి 11: ఈ నెల 30వ తేదీలోగా వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి గౌడ్ ఆదేశించారు. మండల కేంద్రం లోని గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఇంటి పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంపీవో మహ్మద్ అమ్జద్, కార్యదర్శి భీమయ్య, కారోబార్ వెంకన్న తదితరులున్నారు.

శివాలయంలో కూర్చున్న భక్తులు

శివాలయంలో భక్తుల సందడి

కౌటాల, మార్చి 11: సదాశివపేటలోని శ్రీ మహా గణపతి శివాలయంలో సోమవారం భక్తులు పోటెత్తారు. స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు అంబేద శంకరయ్య, అంబేద సంతోష్ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో వంటకాలు చేసి సామూహిక భోజనాలు చేశారు.

చేతిపంపునకు మరమ్మతులు చేయరూ

నిరుపయోగంగా ఉన్న చేతిపంపు

వాంకిడి, మార్చి 11: వాంకిడిలోని ఎస్సీ వాడలో రోడ్డును ఆనుకొని ఉన్న చేతిపంపు చెడిపోయి కాలనీవాసులతో పాటు మండల కేంద్రానికి వచ్చే వారు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చేతి పంపునకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

సీపీఎం నాయకుల నిరసన

కాగజ్‌నగర్ ఎస్సీఎం కాలనీ, మార్చి 11: సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఎస్‌బీఐ చైర్మన్ ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణంలోని ఎస్‌బీఐ ఎదుట సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. సీపీఎం పట్టణ కార్యదర్శి ముంజం ఆనంద్‌కుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట శ్రీనివాస్, నాయకులు తిమ్మారావు, ఉట్ల రవి, నితీశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మెట్లపై నుంచి జారి పడి యువకుడి మృతి

వాంకిడి, మార్చి 11: మండల కేంద్రం లోని ఇంద్రనగర్ కాలనీకి చెందిన పెందుర్ చంద్రశేఖర్ (34) ఆదివారం రాత్రి మెట్లపై నుంచి జారిపడి మృతి చెందారు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రశేఖర్ ఇంట్లో బాత్రూంకు వెళ్లి వచ్చి మెట్లు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డాడు. కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఆసిఫాబాద్ దవాఖానకు రెఫర్ చేశారు. అక్కడికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో..

కాగజ్‌నగర్ ఎస్సీఎం కాలనీ, మార్చి 11: కాగజ్‌నగర్ మండలం నామనగర్‌కు చెందిన సాయికుమార్ (17) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయికుమార్ అదే గ్రామానికి చెందిన ఓ బాలికను ప్రేమించాడు. వీరి ప్రేమ వ్యవహారం ఇరువురి కుటుంబసభ్యులకు తెలవడంతో కొద్ది రోజుల క్రితం ఊరి పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. మేజర్లు అయిన తర్వాతనే పెండ్లి చేయాలని చెప్పారు. కాగా, ఇలోపే సాయికుమార్ మృతి చెందడం పలు అనుమానాలకు దారి తీస్తున్నదని అన్నారు. మృతుడి మెడ చుట్టూ ఘాట్లు ఉండడంతో తమ కుమారుడిని పథకం ప్రకారమే ఎవరో హత్య చేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. సాయికుమార్ తండ్రి సత్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు రూరల్ సీఐ నాగరాజు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం

దహెగాం, మార్చి 11: మండలంలోని ఇట్యాల అంగన్‌వాడీ-1 కేంద్రంలో సోమవారం పోషణ మాసం వేడుకలు నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాసన, బాలింతలకు సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనసూయ మాట్లాడుతూ, గర్భిణులు పోషకాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్ రమాదేవి, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

మందమర్రి రూరల్, మార్చి 11: బొక్కల గుట్ట గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులను సోమవారం ఎంపీడీవో రాజేశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడుతూ ఎండల తీవ్రత పెరుగుతున్నందున ఉదయం పూటనే వచ్చి ఎండ తీవ్రత పెరుగక ముందు పనులు ముగించాలని సూచించారు.

ఉదయం 11 గంటల తర్వాత కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

ఎంపీడీవో కార్యాలయం బయట కూర్చున్న ప్రజలు

సమయపాలన పాటించని అధికారులు

చింతలమానేపల్లి మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలు దాటిన కూడా అధికారులు, సిబ్బంది కార్యాలయానికి రాలేదు. దీంతో తమ సమస్యలను చెప్పుకొనేందుకు వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు కార్యాలయం ఎదుట పడిగాపులు కాశారు. 12 గంటల తర్వాత ఒక్కొక్కరుగా అధికారులు రావడంతో ప్రజలు తమ సమస్యలను విన్నవించారు.

-చింతలమానేపల్లి, మార్చి 11

గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

గ్రంథాలయం ప్రారంభం

కాగజ్‌నగర్ ఎస్సీఎం కాలనీ, మార్చి 11: పట్టణంలోని ప్రజా కార్యాలయంలో పాల్వాయి పురుషోత్తం రావు స్మారకార్థం ఏర్పాటు చేసిన గ్రంథాలయం, రీడింగ్ రూంను సోమవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రంథాలయం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తెరిచి ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని పోటీ పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొంగ సత్యనారాయణ, గోలెం వెంకటేశ్, దోని శ్రీశైలం, గొల్లపల్లి వీరభద్రచారి, సింగం శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ వీర్ల విశ్వేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలి

మంచిర్యాలటౌన్, మార్చి 11: పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. సోమవారం మంచిర్యాల మున్సిపల్ ప్రత్యేక బడ్జెట్ సమావేశం మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య అధ్యక్షతన జరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ మంచిర్యాల మున్సిపల్ బడ్జెట్‌ను రూ. 59. 19 కోట్లతో రూపొందించారు. మున్సిపాలిటీకి వచ్చే ఆదాయ వనరుల్లో పన్నుల రూపేణా ఈ ఏడాది రూ. 13 కోట్లు, అసైన్డ్ రెవెన్యూ రూపేణా రూ. 2.52 కోట్లు, రెంటల్ ఇన్‌కమ్ రూ. 3.20 కోట్లు, ప్రజారోగ్యం, శానిటేషన్ సెక్షన్ రిసిప్ట్ ద్వారా రూ. 50.62 లక్షలు, పట్టణ ప్రణాళికా విభాగం రిసిప్ట్ ద్వారా రూ. 10.09 కోట్లు, ఇంజినీరింగ్ సెక్షన్ ద్వారా రూ. 3.58 కోట్లు, నాన్‌ప్లాన్ గ్రాంటు ద్వారా రూ. 6.04 కోట్లు, ప్లాన్ గ్రాంటు ద్వారా రూ. 95 లక్షలు, ఇతర గ్రాంటుల ద్వారా రూ. 18.92 కోట్లు కలిపి మొత్తం రూ. 59.19 కోట్లు ఆదాయం సమకూరుతుందని చిత్తు అంచనాలు తయారు చేశారు. ప్రారంభ నిలువ మొత్తం రూ. 8.89 కోట్లుగా పేర్కొన్నారు. ఖర్చుల్లో వేతనాలు, పారిశుధ్య నిర్వహణ వ్యయం, రుణాలు, గ్రీన్‌బడ్జెట్ కలిపి రూ. 19.56 కోట్లు, ఇంజినీరింగ్ సెక్షన్ నిర్వహణ, జనరల్ అడ్మినిస్ట్రేషన్ , టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఖర్చులు కలుపుకుని రూ. 5.39 కోట్లు, క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ కింద రూ. 7.96 కోట్లు, మున్సిపల్ జనరల్ ఫండ్ రూ. 32.91 కోట్లు, డిపాజిట్లు, రుణాల కింద రూ. 36 లక్షలు, నాన్‌ప్లాన్ గ్రాంట్లు, ప్లాన్ గ్రాంట్లు, ఇతర గ్రాంట్లు కలిపి రూ. 25.92 కోట్లు ఖర్చు చేయనున్నట్లుగా బడ్జెట్‌ను రూపొందించారు. ఈ బడ్జెట్‌ను కౌన్సిల్ ఆమోదించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో సమస్య లేమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాహుల్, మున్సిపల్ వైస్‌చైర్మన్ సల్ల మహేశ్, కమిషనర్ మారుతీప్రసాద్, మున్సిపల్ ఇంజినీర్ మధుకర్, మేనేజర్ విజయ్ కుమార్, ఏఈ రాజేందర్, ఆర్‌వో శ్రీనివాస రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్‌రాథోడ్, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

శివ మల్లన్న ఆలయ హుండీ లెక్కింపు

హుండీ లెక్కింపులో పాల్గొన్న ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది, విద్యార్థులు

కాగజ్‌నగర్ ఎస్సీఎం కాలనీ, మార్చి 11: కాగజ్‌నగర్ మండలంలోని ఈజ్‌గాం శివ మల్లన్న ఆలయంలో సోమవారం మహాశివరాత్రి జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. హుండీ లెక్కింపును ఆదిలాబాద్ డివిజన్ దేవాదాయ, ధర్మదాయ శాఖ పరిశీలకుడు ఎం రాజమౌళి పర్యవేక్షించారు. జాతరలో దుకాణాల బహిరంగ వేలం, టికెట్ల విక్రయం, హుండీల లెక్కింపు ద్వారా రూ. 22,76,150 వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్, సభ్యులు, అరుణోదయ విద్యాలయం విద్యార్థులు, ఏఎస్ఐ హీరామాన్, రెవెన్యూ అధికారి రాజేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

రెబ్బెన/కాగజ్‌నగర్ ఎస్సీయం కాలనీ, , మార్చి 11: పెద్దవాగులో ఆదివారం గల్లంతు అయిన యువకుడి మృతదేహం సోమవారం లభ్యమైంది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన విఘ్నేష్ అలియాస్ వికీ(21) ఏఐఈఈఈకి ప్రిపేర్ అవుతున్నాడు. ఆదివారం స్నేహితులతో కలిసి జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు వద్ద గల పెద్దవాగులో ఈత కొట్టడానికి వెళ్లారు. విఘ్నేష్ ఈత కొడుతూ లోతు ప్రాంతానికి వెళ్లి మునిగిపోయాడు. తోటి స్నేహితులు కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలించలేదు. దీంతో పోలీసులకు సమాచారం అందించగా జాలర్ల సహాయంతో రాత్రి వరకు గాలింపు చర్యలు చేపట్టగా ఆచూకీ లభించలేదు. తిరిగి సోమవారం ఉదయం గాలించగా మృతదేహం దొరికింది. ఒక్కగానొక్క కొడుకు మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

మారండి.. మంచిగా జీవించండి

మందమర్రి, మార్చి 11: మారండి.. మంచిగా బతకండని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి షీటర్లకు సూచించారు. మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ, సస్పెక్ట్ షీటర్లకు సర్కిల్ కార్యాలయ ఆవరణలో సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించి మాట్లాడారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కార్యకలాపాలు పోలీసు నిఘాలో ఉన్నాయని, చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరని చెప్పారు. షీటర్ల నేర చరిత్ర, ప్రస్తుత జీవన విధానం, స్థితిగతులు, నేర ప్రవృత్తి వైపు ప్రేరేపించిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పాత పద్ధతులు వదులుకోని వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. మంచిగా మారి సమాజాభివృద్ధికి దోహదపడితే వారి షీట్లను తొలగిస్తామని తెలిపారు.